



మంత్రి సుభాష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కార్మికరంగ సమస్యల పరిష్కారానికి కృషి

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కార్మికరంగ సమస్యల పరిష్కారంతో పాటు కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన్ను అమలాపురంలోని స్వగృహంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన సుభాష్ ఎస్ఎఫ్ స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం, కృష్ణకుమారి ఉన్నారు.



మంత్రి సుభాష్‌కు శుభాకాంక్షలు చెప్తున్న ఎస్పీ శ్రీధర్

వైభవంగా బాలబాలాజీ స్వామి చక్రస్నాన మహోత్సవం

- వివరాలు 5లో



చిట్టడవిని తలపిస్తున్న అమలాపురం సబ్ జైలు ప్రాంగణం

- జిల్లాలో మూతపడిన మూడు సబ్ జైళ్లు
- రిమాండు పడితే సెంట్రల్ జైలుకే
- ఈసారైనా సబ్ జైళ్ల నిర్మాణం పూర్తయ్యేనా
- చిట్టడవిని తలపిస్తున్న అమలాపురం సబ్ జైలు ప్రాంగణం



తెరుచుకునేనా!

అమలాపురం టౌన్, జూన్ 19: గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలాపురం సబ్ జైలు ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దాంతో సబ్ జైలు ఆధునికీకరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అప్పటికే జిల్లాలోని తాలూకా కేంద్రాలైన రాజోలు, ముమ్మిడివరం సబ్ జైళ్లు కూడా మూతబడిపోయాయి. ఒక్క కొత్తపేట సబ్ జైలు మాత్రం నామమాత్రంగా పని చేస్తోంది. ఇక జిల్లాలో తాలూకా కేంద్రాల్లో ఉన్న కోర్టుల్లో ఎవరికైనా రిమాండు విధిస్తే వారిని గత ఆరేళ్లుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు. హత్యలు, మానభంగాలు, దోపిడీలు, దొంగతనాలు చేసేవారికి కోర్టుల్లో శిక్షలు విధిస్తే అటువంటి వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తారు. వారితో పాటు రిమాండు పడ్డవారిని కూడా అదే జైలుకు తరలించడంతో ఆయా కుటుంబాల వారు దూరాభారంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం సబ్ జైళ్ల ఆధునికీకరణకు ఏ విధమైన చర్యలూ తీసుకోకపోవడంతో అమలాపురం సబ్ జైలు ప్రాంగణం చిట్టడవిలా మారిపోయింది.

దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే...

దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే నిర్మించిన అమలాపురం సబ్ జైలు అది. 1905లో బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో సబ్ జైలు నిర్మాణం జరిగింది. ఏళ్లు గడిచిపోతున్నా సబ్ జైలు ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. 2019 ప్రథమార్థంలో మూతపడ్డ సబ్ జైలు ఎప్పటికి తెరుచుకుంటుందో తెలియదు. కోనసీమ పరిధిలోని ఒక్క కొత్తపేట ప్రాంతం మినహా మిగిలినచోట్ల ఎవరికైనా కోర్టు రిమాండ్ విధిస్తే వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు.



నేడు శిలాఫలకం ఏర్పాటుచేసిన ప్రాంతంలో పెరిగిన పిచ్చిమొక్కలు

మూతపడ్డ సబ్ జైళ్లు

కోనసీమ ప్రాంతంలో బ్రిటీష్ పాలకుల హయాంలోనే రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట సబ్ జైళ్ల నిర్మాణం జరిగింది. ఇప్పటికే రాజోలు, ముమ్మిడివరం సబ్ జైళ్లు వివిధ కారణాల వల్ల ఏనాడో మూతపడిపోయాయి. అవి ఇక తెరుచుకుంటాయో లేదో కూడా చెప్పలేని పరిస్థితి. 2018 సంవత్సరం వరకు ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాలకు చెందిన రిమాండ్ ఖైదీలను అమలాపురం సబ్ జైలుకు తరలించేవారు. ఇప్పుడా పరిస్థితి కూడా లేకుండా పోయింది. ప్రస్తుతం ఒక్క కొత్తపేట సబ్ జైలు మాత్రమే పని చేస్తోంది. నేరస్తులే కాదు, నేర అభియోగంపై కూడా ఎందరినో రిమాండ్ నిమిత్తం సబ్ జైళ్లకు పంపిస్తుంటారు.

ప్రత్యేకత సంతరించుకున్న సబ్ జైలు..

అమలాపురం సబ్ జైలుకు ఓ ప్రత్యేకత ఉంది. రిమాండ్ విధించబడ్డ ఖైదీల మానసిక ఉల్లాసం కోసం వివిధ రకాల ఆటలు ఆడిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా తప్పనిసరి. ఇక ప్రపంచ విషయాలు తెలుసుకునేందుకు గ్రంథాలయం ఉండనే ఉంది. నేర ప్రవృత్తి నుంచి బయటపడేందుకు అప్పుడప్పుడూ శిక్షణా తరగతులు సైతం నిర్వహించేవారు. ఈ సబ్ జైలుకు 48 మంది ఖైదీలను కేటాయించారు. ఒక్కోసారి 60 మంది రిమాండ్ ఖైదీలను కూడా ఉంచిన సందర్భాలున్నాయి.

రూ.63లక్షలతో ఆధునికీకరణ పనులు...

అమలాపురం సబ్ జైలుకు డబుల్ గేట్ సిస్టమ్ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఏనాటి నుంచో ఉంది. చివరకు రెవెన్యూ శాఖ కొంత స్థలాన్ని అదనంగా కేటాయించింది. దాంతో సబ్ జైలు ఆధునికీకరణ, భవన నిర్మాణ పనులకు రూ.62.85 లక్షలు మంజూరు కాగా 2019 జనవరి 20న అప్పటి హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. సబ్ జైలు చుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మాణంతో పాటు సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్లు నిర్మించాల్సి ఉంది. 2019లోనే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్ జైలు నిర్మాణానికి మంజూరైన నిధులు ఏమయ్యాయో తెలియదు గానీ పనులు మాత్రం నిలిపివేశారు. ప్రస్తుతం అమలాపురం, ముమ్మిడివరం సబ్ జైలు ప్రాంగణాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. అమలాపురం సబ్ జైలు ప్రాంగణంలోనే సూపరింటెండెంట్ క్వార్టర్ భవనం ఉండేది. నేడు అది శిథిలావస్థకు చేరుకుంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో సబ్ జైళ్ల నిర్మాణం పూర్తి చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



లంకలగన్నవరం వంతెన కింద చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

సాగునీటికి అడ్డంకులు లేకుండా చర్యలు

అధికారులకు కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పి.గన్నవరం, జూన్ 19: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంలో భాగంగా పంట కాల్వల్లో సాగునీటికి అడ్డంకులు లేకుండా చూసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. 'ఇలాగైతే....సాగునీరు ముందుకు సాగేదెలా' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. లంకల గన్నవరం వంతెన వద్ద ప్రధాన పంట కాల్వలో ఎక్స్‌కవేటర్ సాయంతో చెత్తను తొలగింపజేసిన అనంతరం ఆర్డీవో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో లంకల గన్నవరంతో పాటు రెండు కిలోమీటర్ల మేర పంట కాల్వను పరిశీలించానన్నారు. అక్కడక్కడా పేరుకుపోయిన చెత్తను, భారీ వృక్షాలను గుర్తించామని, వాటిని తొలగించమని ఇరిగేషన్ అధికారులకు సూచించినట్టు తెలిపారు. పంట కాల్వలను పూర్తిగా పరిశీలించి సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ప్లాస్టిక్ గ్లాసులు, డబ్బాలను సైతం కాల్వల్లో వెయ్యకుండా కాల్వల చెంతనే ఉన్న షాపుల వారికి నోటీసులు జారీ చేయాలని తహసీల్దారు, ఎంపీడీవోలను ఆదేశించారు. అక్విడెక్టుపై ఉన్న గోతులను పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కాగా కొన్నాళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని మండల పరిషత్ సమావేశాల్లో అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. పర్యటనలో తహసీల్దారు ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఇరిగేషన్ జేఈ సుందర్‌సింగ్, గుమస్తా రాణిప్రమీల, ఇన్‌చార్జి ఆర్ఐ పి.నరసింహరావు, సర్పంచ్ పనలపూడి రామకృష్ణ, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, గనిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్వాన కాల్వ ఆధునికీకరణ



గోగన్నమఠంలో పంట కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మామిడికుదురు, జూన్ 19: అధ్వానంగా తయారైన ములికిపల్లి-గోగన్నమఠం పంట కాల్వను ఎట్టకేలకు ఆధునికీకరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపుడెక్క, అడ్డంగా పడిపోయిన చెట్లను ఉపాధి కూలీలు తొలగించి సాగునీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా ఏర్పాటు చేశారు. దీంతో శివారు ప్రాంతమైన గోగన్నమఠం గ్రామానికి సాగునీరు అందింది. స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇది డ్రెయినా!

- కౌశిక డ్రెయిన్‌కు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్సులు
- ఇలా ఉంటే ముంపునీరు పోయేదెలా?
- రైతుల గగ్గోలు



గుర్రపు డెక్క, తూడు, వ్యర్థాలు, పిచ్చిచెట్లతో అడవిని తలపిస్తున్న కౌశిక డ్రెయిన్



కొత్తపేట, జూన్ 19: రైతుల పంట చేలల్లో ముంపు నీటిని మళ్లించుకునేందుకు వీలుగా ఉండే కౌశిక డ్రెయిన్ ఆనవాళ్లు లేకుండా పోయింది. తూడు, గుర్రపుడెక్కతో పాటు వ్యర్థాలు, పెద్ద పెద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. గతంలో అరకొర తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు జరిగి ఎంతో కొంత రైతుల పంటలకు మేలు జరిగేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఐదేళ్లు సంబంధిత ప్రజాప్రతినిధులు, డ్రైనేజీ శాఖ శాఖ అధికారులు ఈ డ్రెయిన్‌వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. రావులపాలెం మండలం పొడగట్లపల్లి వద్ద మొదలైన కౌశిక డ్రెయిన్ కొత్తపేట మండలం పలివెల వంతెన వరకు విస్తరించి ఉంది. రావులపాలెం మండలంతో పాటు ముఖ్యంగా కొత్తపేట మండలం శీలంవారిపాలెం, బి.సావరం, కొత్తపేట ప్రాంత రైతులకు ఈ డ్రెయిన్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అదీ కాకుండా పెద్ద పంట కాల్వ మాదిరిగా ఉండి ముంపునీరు మళ్లించేందుకు రైతులకు ఎంతగానో ఉపయోగపడేది.

ఇదిలా ఉంటే.. కౌశిక డ్రెయిన్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో పాటు కొత్తపేట నుంచి పలివెల వరకు రోడ్డు భాగాన ఉండడంతో ఆక్రమణదారుల కన్నుపడి డ్రెయిన్ బక్కచిక్కిపోయింది. నీరు పారే మార్గం కూడా కుచించుకుపోయింది. డ్రెయిన్‌ను పూడ్చి నిర్మాణాలు చేసినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు సైతం ఓట్ల రాజకీయం కోసం కళ్లు మూసుకున్నారు. దీంతో డ్రెయిన్‌కు ఇరువైపులా భారీ నిర్మాణాలు, రోడ్డు వైపున అద్దెకు ఇచ్చేందుకు కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించడంతో ఆక్రమణదారుల కబ్జాలో కౌశిక డ్రెయిన్ నిండిపోయింది.

అక్రమ కట్టడాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా వచ్చాయి...

సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నా, షాపింగ్ కాంప్లెక్సు నిర్మించుకున్నా సంబంధిత పంచాయతీ అనుమతి, ఆపైవారిచ్చే ఎన్‌వోసీతోనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం పరిపాటి. కానీ ఈ నిర్మాణాలకు ఎటువంటి అనుమతీ లేకుండానే అన్ని సౌకర్యాలతో పాటు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చారంటే సంబంధిత అధికారుల చేతివాటం ఎంతుందో తెలుసుకోవచ్చు. ప్రజాప్రతినిధులు సైతం కళ్లు మూసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత డ్రెయిన్స్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చొరవ చూపి ఆక్రమణలు తొలగించడంతో పాటు కౌశిక డ్రెయిన్‌ను ఆధునికీకరించి రైతులకు ఉపయోగపడేలా పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయిన్‌ను ఆనుకుని నిర్మించిన కమర్షియల్ షాపులు



నాఫెడ్ కేంద్రాల్లో కొబ్బరి కొనుగోళ్లు

అంబాజీపేట, జూన్ 19: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి కొనుగోలు చేస్తామని ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు యు.సుధాకరరావు తెలిపారు. బుధవారం ఆయన అంబాజీపేట మార్కెట్ యార్డులో కొబ్బరి రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీన అంబాజీపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాథుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనసీమలోని నగరం, కొత్తపేట, ముమ్మిడివరం, తాటిపాకల్లో కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.క్వింటాలుకు బాల్‌కోప్రా రూ.12వేలు, మిల్లింగ్ కోప్రా రూ.11,160గా నిర్ణయించినట్టు చెప్పారు. ఈ కేంద్రంలో కొబ్బరి విక్రయించుకునేందుకు రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మూడు నెలల్లో 8వేల క్వింటాళ్లు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సమావేశంలో గణపతి వీరరాఘవులు, ఘైపాల తాతాజీ, అడ్డాల గోపాలకృష్ణ, అరిగెల సూరిబాబు, ముత్యాల జమీలు, అప్పన సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సుధాకరరావు

కోలుకుంటున్న కొమ్మనాపల్లి

కొత్తగా కేసులు నమోదు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు, వైద్య సిబ్బంది

మరోవైపు బెండపూడిలో కేసులు పెరుగుతుండడంతో ఆందోళన



లీకేజీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

తొండంగి,జూన్19: గత పది రోజులుగా డయేరియా వ్యాధి తీవ్రతతో తల్లడిల్లిన కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామం కోలుకుంది. బుధవారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీంతో వైద్యులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకు గ్రామంలో సుమారు వంద కేసుల వరకూ నమోదయ్యాయి. దీంతో గ్రామంలో బేస్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైన వారిని మూడు అంబులెన్స్‌ల ద్వారా యుద్ధ ప్రాతిపదికన జీజీహెచ్‌కు తరలించేవారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుల్లో రోగులకు చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు నిరంతరాయంగా చికిత్స అందించారు. జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలను పర్యవేక్షించి ఆదేశాలు ఇవ్వడంతో ఆ రెండు అంశాలలో ఉన్న లోటుపాట్లు సరి అయ్యాయి. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తమై మెరుగైన సేవలు అందించింది.

బెండపూడిలో డయేరియా కేసులు

కొమ్మనాపల్లిలో ఒకపక్క కేసులు తగ్గగా మరోపక్క బెండపూడిలో కేసులు నమోదు కావడంతో ఆందోళన చెందుతున్నారు. మొదటి రోజు 18 కేసులు నమోదుకాగా రెండో రోజు 12 కేసులు నమోదయ్యాయి. తుని ఏరియా ఆసుపత్రికి నలుగురిని పంపించగా మరో నలుగురు అక్కడ చేరారు. మరో నలుగురికి స్థానికంగా చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డీఎల్‌పీవో బాలామణి గ్రామాన్ని సందర్శించి వ్యాధి వ్యాప్తికి కారణంగా చెప్తున్న రెండు బావులను మూయించివేశారు. ఓహెచ్ఆర్ ట్యాంకు నీటిని కూడా ఆపివేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.పైప్‌లీక్‌లను అరికట్టేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సహాయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మలేరియా అధికారి భాస్కరరావు వైద్యాధికారులు కె.అర్చన, ఆర్.లలిత, ఎంహెచ్‌వో రవికుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన టీడీపీ నేతలు

స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు సీనియర్ టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు బుధవారం బాధితులను పరామర్శించారు. వైద్య సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, శాసన సభ్యురాలు యనమల దివ్య అధికారులకు అవసరమైన సూచనలు చేశారని రోగులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. వారి వెంట సాధనాల నూకరాజు తదితరులు ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న యనమల రాజేష్ తదితరులు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాతలు

అన్నవరం, జూన్ 19: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం కాకినాడకు చెందిన వెంకటేశ్వరప్రసాద్, జ్యోతిశ్రీ దంపతులు లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ సూపరింటెండెంట్ స్వామీజీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలబాలాజీ స్వామి చక్రస్నాన మహోత్సవం



చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారికి వైనతేయ నదిలో చక్ర స్నానాన్ని వైభవంగా నిర్వహించారు. నాలుగో రోజు జ్యేష్ఠ శుద్ధ బుధవారం సుప్రభాతసేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలబోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమం మంగళాశాసన, మహా పూర్ణాహుతి , బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని భారీ ఊరేగింపు నడుమ వైనతేయ నది వరకు తీసుకువెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ స్వామివారి ప్రతిమను అర్చకులు శిరస్సున ధరించి స్వామి వారికి చక్రస్నానాన్ని ఆచరింప చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో అర్చకుడు చలమచర్ల కృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌పీకేయం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు రెండు, మూడేళ్ల ఈ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. వివరాలకు 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దుర్గాడలో డయేరియా?

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన అయిదు సంవత్సరాల పాప వాంతులు విరోచనాలతో బాధపడుతూ ఉండటంతో తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనితో అప్రమత్తమయిన వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో ఇంటింటా సర్వెలెన్స్ నిర్వహించారు. మిగిలిన వారికి ఎటువంటి లక్షణాలు లేవని గుర్తించామని వారు తెలిపారు. మంచినీటి శాంపిల్స్ సేకరించారు.



సప్తనదుల జలాలను చూపిస్తున్న అర్చకులు

రేపు సప్తనదీ జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి సప్తనదీ జలాలతో జ్యేష్ఠ మహాభిషేకం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మహా జ్యేష్ఠాభిషేకానికి ఇతర రాష్ట్రాల్లో ఉన్న సప్త నదుల నుంచి సేకరించిన జలాలను ఆలయంలో బుధవారం అర్చకుల సమక్షంలో భద్రపర్చామన్నారు. శుక్రవారం జరిగే మహాజ్యేష్ఠాభిషేకంలో భక్తులు పాల్గొనడానికి ఆలయం వద్ద రూ.400 టిక్కెట్‌ను తీసుకోవాలన్నారు. ఉదయం 5.30గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 9 గంటలకు మూలవరులకు సప్త నదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించిన అనంతరం మహాశాంతి హోమం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు

రాజమహేంద్రవరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 19: సికిల్ సెల్ ఎనీమియా(కొండవలి కణ రక్తహీనత) అంటువ్యాధి కాదని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఉన్నత పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కేవలం జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో 45 ఏళ్ల లోపు ఉన్న వారికి అవగాహన కల్పించి, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ ద్వారా ఈ వ్యాధిని అరికట్టడానికి ప్రణాళిక రచించిందన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబలిష్టంగా మారుతాయని తెలిపారు. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలలో హిమోగ్లోబిన్ కొడవలి కణాలుగా మారి తద్వారా ఏ భాగంలో నైనా కణజాలం మారడం వలన రక్తహీనత పరిస్థితులకు దారి తీస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, డీపీఎంయూ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అభిషేక్ రెడ్డి జిల్లా ఎపిడమాలజిస్ట్ సుధీర్ బాబు మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వినియోగం, తరచు నీళ్ల తాగడంపై అవగాహన కల్పించారు. కళ్లు పసుపుగా మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం ఈ వ్యాధి లక్షణమని తెలిపారు. గర్భాధారణ సమయంలో సమస్యలు వస్తే అవయవనష్టం కలగవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి నిర్ధారించడానికి ఎలక్ట్రోఫోరెసిస్ అనే రక్త పరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మిస్ట్రెస్ బి.సీత, డిప్యూటీ వార్డెన్ బి.కల్రమ్మ, పీడీ జి.చిన్నారావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడియపులంకలో చోరీ

10 కాసుల బంగారం, రూ.లక్ష అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, జూన్ 19: కడియపులంకలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న అత్తారింటికి వెళ్లారు. ఈ సమయంలో వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుగొట్టి బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను పగలకొట్టి అందులో ఉన్న 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి, రూ.లక్ష నగదు కాజేశారు. ఉదయం వెంకటేశ్వరరావు వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు బద్దలు గొట్టి ఉన్నట్లు, బీరువా తెరచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ తులసీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కడియంలో జరిగిన మండల పరిషత్ సమావేశానికి వచ్చిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విషయం తెలియడంతో కడియపులంక వెళ్లారు. వెంకటేశ్వరరావు సోదరుడు ఎస్సయ్యతో మాట్లాడారు. నిందితులను పట్టుకుని బంగారం, వెండితో పాటు నగదును కూడా రికవరీ చేసి వెంకటేశ్వరరావుకు న్యాయం చేయాలని పోలీసులకు చెప్పినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.



సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

జనసేన సంబరాలు

అమలాపురం టౌన్, జూన్ 19: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బుధవారం బాధ్యతలు చేపట్టడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సంబరాలు నిర్వహించారు. పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో ఇక నుంచి ప్రజా పాలన సాగుతుందని నాయకులు లింగోలు పండు, యేడిద శ్రీను, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు పిండి రాజా, ఆకుల బుజ్జి, నల్లా వెంకటేశ్వరరావు, కొప్పుల నాగమానస, తిక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా

బాధితుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్వహిస్తున్న బైపాస్ రోడ్డు పనులను బుధవారం స్థానికులు అడ్డుకుని నిరసన చేపట్టారు. రెవెన్యూ అధికారులు 2014లో సర్వే చేసి దాని ప్రకారం రోడ్డు వేయకుండా కొంతమంది పెద్దల పలుకుబడి వల్ల అలైన్‌మెంట్ మార్చి పేదల భూముల్లో నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని నిరసన తెలిపారు. అలైన్‌మెంట్ మార్చడం వల్ల చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోవలసి వస్తుందని వాపోయారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు వేయాలని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో నేరుగా రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు అర్జీ పెట్టుకుంటున్నట్టు బాధిత రైతులు తెలియచేశారు. రాష్ట్రపతి వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని అర్జీ ద్వారా వేడుకున్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి

చర్యలు తీసుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత



సమావేశం నిర్వహిస్తున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి యోగ్యమైన కేసులు అధిక మొత్తంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు ఆయా జిల్లాల ఎస్పీలతో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులతో పాటు అదనపు జిల్లా న్యాయస్థానాల్లోని మోటారు వాహనాల ప్రమాదాల కేసుల్లోని బాధితులకు తగు పరిహారం అందించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే బార్ అసోసియేషన్ల అధ్యక్షులతో కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీలు పి.జగదీశ్, ఎస్.సతీశ్ కుమార్, ఏ.జగదీశ్, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న యువతి

ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

కొత్తపల్లి, జూన్ 19: ప్రేమించి పెళ్లి చేసుకొంటానని మాయమాటలు చెప్పి పెళ్లి మాటకొస్తే ముఖం చాటేస్తున్న ప్రియుని ఇంటి ముందు ప్రియురాలు బుధవారం ఆందోళన ప్రారంభించింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఎ.నవీన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన పి.మానసను ప్రేమించి పెళ్లి చేసుకొంటానని హామీ ఇచ్చాడు. గత నాలుగు సంవత్సరాలుగా కలిసి తిరిగామని, ఇంకెంత కాలం పెళ్లి చేసుకోకుండా ఉంటామని తక్షణమే పెళ్లి చేసుకోవాలని యువతి ప్రియుడు కుమార్‌పై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో కుమార్ ఇంట్లో పెద్దలు పెళ్లికి అంగీకరించడం లేదని హైదరాబాద్ వెళ్లిపోయాడని యువతి తెలిపింది. పెద్దల సమక్షంలో ఏప్రిల్ నెలలో నిశ్చితార్థం అయినా సరే హైదరాబాద్ వెళ్లి తిరిగి రాలేదని, ఇచ్చినమాట తప్పి తనను మోసం చేసి తప్పించుకొని తిరుగుతున్న కుమార్ పెళ్లి చేసుకొనే వరకు పోరాటం చేస్తానని, పెళ్లి చేసుకోకపోతే ప్రాణత్యాగం చేస్తానని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఇరువర్గాల పెద్దలు కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించడంతో చర్యలు చేపట్టారు.

అనుమానం పెనుభూతమై..

● భార్యను హతమార్చిన భర్త ● కాకినాడ రూరల్ హార్బర్ పేట హత్య కేసు ఛేదన

సర్పవరం జంక్షన్, జూన్ 19: కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో సంచలనం రేకెత్తించిన వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. భార్యపై ఉన్న అనుమానం పెనుభూతంగా మారడంతో పాటు అప్పులు తీర్చేందుకు నగలు ఇవ్వడానికి నిరాకరించడంతో ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ వివరించారు. కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో నివాసం ఉంటున్న ఓలేటి నరసింహమూర్తి భార్య ఓలేటి సీత (26)ను ఈనెల 16వ తేదీన రాయితో కొట్టి హత్యకు పాల్పడ్డాడు. అయితే తప్పించుకునేందుకు తన భార్య ఒంటిపై ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు కోసం ఎవరో హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సీత తల్లి మాత్రం అల్లుడే డబ్బుల కోసం తమ కుమార్తెను హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాకినాడ ఎస్‌డీపీవో హనుమంతరావు ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్తే సీతను హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఓలేటి నరసింహమూర్తికి ఎనిమిదేళ్ల కిందట సీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. సీత వలసపాకల రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. భర్త కాకినాడ పోర్టులో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. భార్యపై అనుమానంతో గత రెండు నెలలుగా వేధింపులకు పాల్పడుతూ ఇతరులతో వివాహేతర సంబంధం అంటకట్టి వేధించేవాడు. రూ. 3.50 లక్షలు అప్పుచేసి ఐపీఎల్‌పై బెట్టింగ్ కాయగా, డబ్బులు పోయాయి. దాంతో డబ్బుల కోసం భార్య ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు ఇమ్మని వేధించాడు. ఈ విషయమై భార్యాభర్తల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనెల 16న ఉదయం 6.30 గంటలకు సీతను ఎవరో తలపై కొట్టి హత్యచేసి బంగారు వస్తువులను పట్టుకుపోయారని తల్లికి సమాచారం రావడంతో వెళ్లి చూడగా కుమార్తె తలపై రక్తంతో ఉండటం, బంగారు వస్తువులు కనిపించలేదు. తన కుమార్తెను అల్లుడే హత్య చేశాడని అనుమానం వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు పర్యవేక్షణలో సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ ఎ.సన్యాసిరావు, పోర్టు ఎస్‌హెచ్‌వో వి.సుమంత్ దర్యాప్తు చేశారు. భర్త నరసింహమూర్తి భార్యను హత్య చేసినట్లు గుర్తించి బుధవారం హార్బర్‌పేటలో అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. భార్య హత్యకు ఉపయోగించిన రక్తపు మరకలు కలిగిన రాయి, బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:186701

EDUCATION

» B.Sc. అగ్రికల్చర్ - 4 సం.లు; B.Voc. డైరీయింగ్ & AH - 3 సం॥; B.B.A - ఏవియేషన్ - 3 సం॥. కోర్సులు. అర్హత : ఇంటర్. ప్రభుత్వ / క్యాంపస్ ఉద్యోగాలు కలవు. అడ్మిషన్లకు సంప్ర : ఆంధ్ర లయోలా కాలేజ్, విజయవాడ. సెల్ : 79891 00323, 74166 98395

AJB - 194703

4 Lines CLASSIFIED Rs.230/- Only

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన

రాయవరం, జూన్ 19: సికిల్ సెల్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని రాయవరంలో బుధవారం వెలుగు ఏపీఎం నాజర్ హుస్సేన్ ఆధ్వర్యంలో మహిళలకు సికిల్ సెల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్ సెల్ వ్యాధి వల్ల అలసట, శ్వాస ఆడకపోవడం, పిల్లలు పెరుగుదల మందగించడం, కంటి సమస్యలు, కళ్లు తెల్లగా మారడం వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ కొండలరావు పాల్గొన్నారు.

- ద్రాక్షారామలో అంబేడ్కర్‌కు నివాళి
- దళిత సంఘాలు, టీడీపీ దళిత నాయకుల ఆధ్వర్యంలో సమావేశాలు

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



అమలాపురం: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేస్తున్న జిల్లాశాఖ అధ్యక్షుడు ప్రభాకరరావు

అమలాపురం రూరల్, జూన్ 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బండారులంకలోని కాంగ్రెస్ జిల్లా శాఖ కార్యాలయం వద్ద బుధవారం జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ప్రధాన కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, నాయకులు వడ్డి నాగేశ్వరరావు, మీసాల బాబీ, మహబూబ్ షకీలా, పాలెపు ధర్మారావు, పులుసుగంటి ప్రకాష్, వస్కా బాబు, రెడ్డి బాబు, ఈతకోట సోమరాజు తదితరులు పాల్గొన్నారు. అమలాపురంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వంటెద్దు బాబి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిట్టిబాబు ఇంటి వద్ద బుధవారం రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, చిట్యాల జోగేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్, కొంబత్తుల శ్రీనివాస్, సాకే రాజు, మట్టా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్టాల రామజోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో అన్నాబత్తుల సత్యనారాయణ, పేరంటాలు నాయుడు, కొండేటి శ్రీను పాల్గొన్నారు.

మండపేట: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో భోజనాలు పెట్టారు. కాంగ్రెస్ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, కొడవల వెంకటసుబ్బారావు, మగ్గం జాకబ్‌రాజ్, వల్లభదాసు చిన్న కుచ్చుబాబి కొండ, దుర్గారావు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు, నియోజకవర్గ కన్వీనర్ పాలెపు ధర్మారావు, చెల్లూరి బాలకృష్ణ, పాలెపు ధర్మరాజు, పాలెపు సత్తిరాజు, మల్లాడి శ్రీను పాల్గొన్నారు.

రావులపాలెం: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రత్యేక ప్రతిభావంతుల విద్యార్థులతో కలిసి కేక్‌ను కట్‌చేసి, వారికి భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంధి శేషగిరిరావు, ఊడిమూడి తమ్మిరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పునరుద్ధరణపై హర్షం





ద్రాక్షారామ: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ దళిత నాయకులు, ఐ.పోలవరం: మురమళ్ళలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ సమావేశం

ద్రాక్షారామ, జూన్ 19: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు పేరుమార్చి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పేరుతో ప్రారంభించడాన్ని నియోజకవర్గ దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ద్రాక్షారామలోని యానాం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో టీడీపీ దళిత సంఘాల నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, జగన్ రద్దుచేసిన 27 పథకాలు పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాటే సుబ్రహ్మణ్యం, కొండేటి రమేష్, మద్దా కృష్ణమూర్తి, పెయ్యల రాంబాబు, కత్తుల వెంకటేష్, గుబ్బల కామేష్, సోమరాజు శ్రీనివాసరావు, యలమంచిలి వెంకటేష్, మాదాసి దుర్గా ప్రసాద్, వాకడ వెంకన్న, చెల్లె కొండబాబు, గుర్రాల సుబ్బారావు పాల్గొన్నారు. అంబేడ్కర్ పేరు పునరుద్ధరించడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జనసేన నాయకుడు బుంగ కృతజ్ఞతలు తెలిపారు.

ఐ.పోలవరం: దళిత విద్యార్థుల విదేశీ చదువుల కోసం అమలుచేసిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి జగన్ అంబేడ్కర్ పేరును తొలగించగా ఇప్పుడు సీఎం చంద్రబాబు తిరిగి అంబేడ్కర్ పేరుతోనే విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టడంపై టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా సమావేశం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం మురమళ్ళ టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ తన పేరును పెట్టుకోవడం వెనుక దళితుల పట్ల ఆయనకున్న వ్యతిరేకతను తెలియచేసిందన్నారు. ఈకారణంగానే టీడీపీ హయాంలో అమలులో ఉన్న దళిత సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారన్నారు. చంద్రబాబు దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు), మిమ్మితి చిరంజీవి, పండు రాంజీ, ఎల్.వి. రమణ, వీధి వెంకటేష్, బీర సత్యకుమారి, సాకా సీతాదేవి, బొంతు శ్రీరాములు, జనిపల్లి కృష్ణమూర్తి, ఎస్.గౌతమ్‌శేఖర్, మెండి కమల, గొల్లపల్లి గోపి, ముమ్మిడివరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

మండపేట: విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరును కూటమి ప్రభుత్వం పునరుద్ధించడంపై దళిత సంఘాల నాయకులు కొవ్వాడ అప్పన్నబాబు, చాపల వీరబాబు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పేరుమార్పుపై దళిత సంఘాలు ఎన్ని పోరాటాలు చేసినా పట్టించుకోకుండా సీఎం జగన్ నియంతలా వ్యవహరించారని దళిత సంఘాల నాయకులు దూళి జయరాజు ఆరోపించారు. అలాగే విదేశి విద్యా పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ ఎన్ని ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్‌మాదిగ ఆరోపించారు. కొత్త ప్రభుత్వం అంబేడ్కర్ పేరును పునరుద్ధరించడంపై సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

రాజోలు: విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ చేయడం పట్ల వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, దళిత చైతన్యవేదిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో దళిత చైతన్యవేదిక సమావేశం బుధవారం జరిగింది. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ శ్యామ్‌బాబు మాట్లాడుతూ విదేశీ విద్యా పథకానికి గత ప్రభుత్వం అంబేడ్కర్ పేరును తొలగించడం బాధాకరమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ సంక్షేమ పథకాలను, కార్పొరేషన్, సబ్‌ప్లాన్ నిధులను కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించి ఎస్సీల పురోగతికి కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను, రాయితీలను, నిధులను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, జిల్లెళ్ల వినోద్, బత్తుల జనార్ధనరావు, తెన్నేటి నాగేశ్వరరావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ, బుడితి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎవరికీ అర్థం కాదనడం హాస్యాస్పదం

రాజోలు, జూన్ 19: పోలవరం ప్రాజెక్టు ఎవరికీ అర్థం కాదు. ఎందుకంటే నాకే అర్థం కాలేదని మాజీ మంత్రి అంటి రాంబాబు అనడం హాస్యాస్పదంగా ఉందని, ఆయన ఏమైనా జలవనరుల శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారా అంటూ కోనసీమ జిల్లా రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బోనం నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. తాటిపాకలోని ఆయన స్వగృహం వద్ద ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన బుధవారం రైతు సమావేశం జరిగింది. బోనం మాట్లాడుతూ 72శాతం పోలవరం పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేశారని తెలిపారు. పట్టిసీమను తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో చంద్రబాబు పూర్తి చేశారన్నారు. పట్టిసీమను వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకున్న విషయాన్ని బోనం గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, రాజోలు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిట్టూరి సంతోష్, చెల్లుబోయిన రామచంద్రరావు, శీలం ఫణి, గెడ్డం ప్రసాద్, బోనం ఫణికుమార్, నల్లా పరంకుశరావు పాల్గొన్నారు.

గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు

మండపేట, జూన్19: కేశవరం, ద్వారపూడిగ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు అందుతున్నాయని తహసీల్దార్ సురేష్‌కుమార్ చెప్పారు. ఎక్కడైనా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రావులపాలెం, జూన్ 19: రావులపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. రావులపాలెంలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదన్నారు.

తాగునీటి నాణ్యతా పరీక్షలు

అల్లవరం, జూన్ 19: వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా పరిశుభ్రతా చర్యలు పాటించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. నీటి కాలుష్యం వల్లే అనారోగ్య పరిస్థితులు వస్తాయన్నారు. కోడూరుపాడులో నీటి నాణ్యతా పరీక్షలు బుధవారం నిర్వహించారు. శ్రావణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా

మలికిపురం, జూన్ 19: గ్రామస్థాయి, మండల స్థాయిలో మిమ్మల్ని నాయకులుగా నిలబెట్టాలన్నదే నా ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ అన్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద బుధవారం మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ఎన్డీఏ సమావేశంలో తనను విజయపథంలో నడిపించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈవిజయం నాది కాదు, మీది, మీరందరూ సమష్టి నాయకత్వంతో పనిచేసి నాకు మంచి విజయాన్ని అందించారన్నారు. ప్రజా సమస్యలనే ముందుకు తీసుకువెళ్లాలని, వ్యక్తిగత సమస్యల జోలికి వెళ్లవద్దన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే అధికారులతో మాట్లాడానన్నారు. కూటమి నాయకులు దేవను దుశ్శాలువాతో అభినందించారు.ఎంపీపీలు కేతా శ్రీను, ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చిటికెల రామ్మోహనరావు, ముదురునూరి చినబాబు, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, మాలే శ్రీనివాసనగేష్, గెడ్డం సింహ, అడబాల సాయిబాబు, గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, బోళ్ల వెంకటరమణ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, మంగెన భూదేవి, బందెల పద్మ, అడబాల రమాదేవి, చెల్లుబోయిన హెలీన, తాడి మోహన్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, జి.రవికిరణ్, కె.దుర్గాదేవి, అయినవిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నీట్ అక్రమాలపై విచారణ జరిపించాలి

ద్రాక్షారామ, జూన్ 19: నీట్ పరీక్షలో అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు బి.సిద్దూ డిమాండు చేశారు. బుధవారం వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలో కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక మందిరంలో జరిగిన పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రం లీకు అయిందని వస్తున్న ఆరోపణలపై కేంద్రప్రభుత్వం, ఎన్‌టీఏ విచారణ జరపకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గుజరాత్, హర్యానా, బీహార్ రాష్ట్రాల్లోఒక్కో విద్యార్థినుంచి రూ.30లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సీట్లు, బెస్ట్ అవెలబుల్ పథకాన్ని కొనసాగించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు ఎస్.భానుతేజా, వి.సుమంత్, ఎ.రేవంత్, వీరబాబు, మానసకుమార్, మహేష్‌బాబు, సంజయ్, ఏడుకొండలు పాల్గొన్నారు.

యానాం స్టోర్స్ వివరాలు వివరించాలి

యానాం, జూన్ 19: యానాం కోఆపరేటివ్ స్టోర్స్ పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని వీసీకే పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్టోర్స్ పాలకమండలి ఎన్నికలు నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. స్టోర్స్‌లో సభ్యులను చేర్చుకోవడం, ప్రస్తుతం సభ్యుల సంఖ్య, నియమ నిబంధనలు తదితర అంశాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే స్టోర్స్‌లో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, లిక్కర్ షాపులకు ఫీజులు కట్టి నిర్వహించలేని పరిస్థితిలో ఉందన్నారు. స్టోర్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

నోట్స్ పుస్తకాలు పంపిణీ



కె.గంగవరం, జూన్19: విశాఖపట్నం వాస్తవ్యులు మల్లికార్జున ట్రాన్స్‌పోర్టు అధినేత భాజంకి సోమేశ్వరరావు మిత్ర బృందం ద్వారా అముజూరు మెయిన్, నెం.1, కూళ్లమెయిన్, కూళ్లనెం.1, నరజాడ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.30వేలు విలువైన నోట్స్‌పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ అందించారు. కూళ్ల, అముజూరు సర్పంచ్‌లు చిల్లే నాగేశ్వరరావు, నానావరపు కళ్యాణి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.గుణవంతుడు, చొల్లంగి శ్రీనివాసు, డి.శ్రీనివాసు, పి.శ్రీనివాసు, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకుల కృషి

అల్లవరం, జూన్ 19: ఉపాధి హామీ పనులను నూరు శాతం సక్రమంగాచేసి ప్రగతి బాటలో నిలవడంలో క్షేత్ర సహాయకుల కృషి అభినందనీయమని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. ఆర్థిక సంవత్సరంలో ప్రగతి బాటలో ఉపాధి పనులుచేసిన దేవగుప్తం, ఓడలరేవు క్షేత్ర సహాయకులు గెడ్డం ఏడుకొండలు, మధుర శ్రీనివాస్‌లను అభినందించారు. ఏపీవో వి.శ్రీనుబాబు, ఏవో లక్ష్మణరావు, అనిల్, నాగేశ్వరరావు, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం చెల్లింపులో అవకతవకలపై ఫిర్యాదు

ముమ్మిడివరం, జూన్ 19: ముమ్మిడివరం నగర పంచాయతీలో చైర్మన్, కౌన్సిలర్ల గౌరవ వేతనాలు చెల్లింపులో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, 19వ వార్డు కౌన్సిలర్ కడలి సౌజన్య భర్త నాగమల్లేశ్వరరావులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మార్చి 30న జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశానికి చైర్మన్ హాజరు కాకపోవడంతో వైస్‌చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారని, అయితే ఆ సమావేశానికి చైర్మన్ హాజరైనట్టు చూపి రూ.12 వేలు గౌరవ వేతనం చెల్లింపు జరిగిందని, అలాగే మే 31న జరిగిన కౌన్సిల్ సమావేశానికి చైర్మన్‌తో పాటు 8మంది కౌన్సిలర్లు హాజరుకాగా తొమ్మిది మందికి గౌరవ వేతనం చెల్లించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశానికి చైర్మన్ హాజరైతే రూ.12వేలు, కౌన్సిలర్లు హాజరైతే రూ.2,500 గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంటుంది. అయితే సమావేశాలకు చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరు కాకపోయినా హాజరైనట్టు చూపుతూ వారికి గౌరవ వేతనం చెల్లించడంపై కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, మేనేజర్ నూకరాజు, బి గుమస్తా శ్రీహరిలపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మండపేట, జూన్ 19: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలు పనిచేయాలని ఎన్‌జీవో సంఘ జిల్లా నేత జి.రామ్మోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండపేట యూనిట్ ఎన్‌జీవో నూతన కార్యవర్గం ఎన్నికజరిగింది. గతంలో ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన జుత్తుగ మల్లికార్జునరావు మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంఘ ఉపాధ్యక్షుడిగా జెడ్.మేడపాడు పంచాయతీ కార్యదర్శి వెంటూరి అమర్‌నాథ్‌చౌదరి, సంయుక్త కార్యదర్శులుగా ఇప్పనపాడు కార్యదర్శి సుబ్బారావు, జి.పద్మలత, కోశాధికారిగా మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ గోపాల్ నియమితులయ్యారు. ఆశీర్వాదం, ఈవోపీఆర్డీ డి.రాజు, ప్రభుత్వశాఖల ఉద్యోగులు, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల కృష్ణ, జిల్లా సహాధ్యక్షులు చెర్రిల చంద్రరావు, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ మట్టపర్తి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎన్‌జీవో సంఘ నూతన కార్యవర్గం ఎన్నికైన సభ్యులు

చంద్రబాబు, పవన్ ఫొటోలు



ఆత్రేయపురం, జూన్ 19: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు.

శివాజీకి నివాళులు

కొత్తపేట, జూన్ 19: ఛత్రపతి శివాజీ హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని సంరక్షించిన వారిలో అగ్రగణ్యుడుగా పేరుగాంచిన వీరుడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. బుధవారం శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాడపాలెంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పాలాటి మాధవస్వామి, పి.బసవరాజు, తొగరు సీతారామాంజనేయులు, పెదపూడి బాపిరాజు, బండారు సూర్యారావు పాల్గొన్నారు.

8వతరగతి కొనసాగించాలి

ముమ్మిడివరం, జూన్ 19: అమలాపురం మండలం చిందాడగరువులో ఉన్న ఎంపీపీ యూపీ పాఠ శాలలో ఎనిమిదో తరగతిని కొనసాగించాలని స్థానిక ఎంపీటీసీలు మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. డీఈవో కె.కమలాకుమారికి వారు వినతిపత్రం అందించారు. స్కూల్ హెచ్ఎం కృష్ణవేణితో డీఈవో ఫోన్‌లో మాట్లాడి సంబంధిత పత్రాలను వెంటనే అందించాలని ఆదేశించారని వారు తెలిపారు.

విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం: డీఈవో

మలికిపురం, జూన్ 19: జిల్లాలో విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి అన్నారు. బుధవారం విశ్వేశ్వరాయపురంలో జిల్లా పరిషత్ హైస్కూలును ఆమె సందర్శించారు. అడ్మిషన్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని సూచించారు. అలాగే కమలకుమారి రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్‌ను ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ వద్ద కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు సరఫరా అయిన పుస్తకాలన్నీ పంపిణీ చేశామని, ఏకరూప దుస్తులు రావాల్సి ఉందన్నారు. డీఈవో వెంట డిప్యూటీ డీఈవో జి.సూర్యప్రకాశరావు, ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, పంగం భైరవమూర్తి, టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని ఉన్నారు.

దళితులకు మరో రెండు మంత్రి పదవులు ఇవ్వాలి

అమలాపురం రూరల్, జూన్ 19: కూటమి ప్రభుత్వంలో దళితులకు మరో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు రెండు మంత్రి పదవులు మాత్రమే ఇచ్చారన్నారు. నడిపూడిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కల్యాణ మండపంలో బుధవారం నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన 27దళిత పథకాలను పునరుద్ధరించాలని కోరారు. సీనియర్ నాయకులు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, మంద వెంకటేశ్వరరావు, ఉందుర్తి సత్యనారాయణ, నూటికుర్తి మూర్తి, కొడమంచిలి కృష్ణ, ఈతకోట రాజు, చాట్ల సత్యనారాయణ, పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 600 పాఠశాలల్లో ఆడిట్ పూర్తి

అమలాపురం టౌన్, జూన్ 19: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాఠశాలల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జీసీ రెడ్డి అండ్ అసోసియేట్స్ నుంచి వచ్చిన ఆడిటర్లు బి.పవన్‌కల్యాణ్, ఎస్.టైటస్, బి.శివరమేష్ ఆధ్వర్యంలో పాఠశాలల ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ నిర్వహిస్తున్న తీరును ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అక్కౌంటింగ్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ఏఎంవో పి.రాంబాబు పర్యవేక్షించారు. అమలాపురం, అయినవిల్లి, అల్లవరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన తదితర మండలాలకు చెందిన 385 పాఠశాలల ఆడిట్ పూర్తి చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో 600 పాఠశాలల్లో ఆడిట్ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.విజయకుమారి, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

చొప్పెల్లలో విజయోత్సవాలు

ఆలమూరు, జూన్ 19: కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావును అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో చొప్పెల్లలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా బాణసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. ఓటర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజేతను కలిసిన స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి

ముమ్మిడివరం, జూన్ 19: ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజును రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.లోకమాన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలతో అభినందించి దుశ్శాలువాలతో సత్కరించారు. జిల్లాలో స్కిల్ డెవలెప్‌మెంట్ ద్వారా జరుగుతున్న పలు అంశాలపై చర్చించారు. ఏపీఎస్డీవో నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కొత్తపేట, జూన్ 19: కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు తెలిపారు. ఈజాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్బీఐ లైఫ్, ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, డిక్సాన్, రాక్‌మెన్, డైకిన్ వంటి కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియమాక పత్రాలు అందజేస్తారన్నారు. పది, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో ఉదయం 9గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

బుచ్చిబాబుకు జనసేన శుభాకాంక్షలు

కాట్రేనికోన, జూన్ 19: చెయ్యేరుకు చెందిన జనసేన నాయకులు బుధవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల బుచ్చిబాబును మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. తన విజయానికి కృషి చేసిన జనసేన నాయకులకు బుచ్చిబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చెయ్యేరు ఉపసర్పంచ్ త్సవటపల్లి వెంకటేశ్వరరావు, కాయల బలరామ్, బసవా మురళి, త్సవటపల్లి మణికుమార్, ఏడిద సూరిబాబు, నంద్యాల సురేంద్ర, కనకాల నాని, అడపా రాము, కంకిపాటి బాబి, నంద్యాల తాతకాపు, కర్రి లోవరాజు, బొక్కా జైరమేష్, నంద్యాల సాయి, త్సవటపల్లి పార్థసారధి, కానూరు ప్రకాష్, గోదాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఉద్యోగ సంఘ నేతల శుభాకాంక్షలు



పి.గన్నవరం, జూన్ 19: మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆయన నివాసం వద్ద ఏపీజేఏసీ అమరావతి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఉద్యోగులందరూ ప్రభుత్వానికి సహకరిస్తారని, వారి సమస్యలు పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చూడాలని మంత్రిని ఉద్యోగ సంఘం నేతలు కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గిడ్ల చిరంజీవి, ఆర్టీసీ నాయకులు నిమ్మకాయల కృష్ణమూర్తి, నంద్యాల రామచంద్రరావు, రవికుమార్, ఏపీఆర్ఎస్ఏ నాయకులు రమణ, ఐ.కొండయ్య, రాయుడు, గణేష్ ఉన్నారు.

బురద రోడ్డుపై జనసేన నిరసన

మామిడికుదురు, జూన్ 19: వర్షం వస్తే మామిడికుదురు నుంచి కొర్లగుంట వెళ్లే రహదారి బురదతో అధ్వానంగా తయారవుతుందని, వెంటనే రోడ్డును నిర్మించాలని జనసేన నాయకులు బుధవారం బురదమయమైన రోడ్డు వద్ద నిరసన చేపట్టారు. సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఎర్ర కంకరతో రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల కొద్దిపాటి వర్షానికే రోడ్డు చిత్తడిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో రుద్ర శ్రీను, యింటి మహేంద్ర, కోలా సురేష్, పాయసం సత్తిబాబు, యింటి గణపతి పాల్గొన్నారు.

వాటరు ట్యాంకుల శుభ్రం

కొత్తపేట, జూన్ 19: జిల్లా పంచాయతీ ఆదేశాలతో కొత్తపేట, వానపల్లి మేజర్ పంచాయతీల వద్ద ఈవో వేగుళ్ల వెంకటరామన్ ఆధ్వర్యంలో బుధవారం పరిసరాల పరిశుభ్రత, రక్షిత మంచినీటి ట్యాంకుల క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో వాటరు ట్యాంకుల వద్ద ఉన్న జంగిల్‌ను పూర్తిగా తొలగించి పరిశుభ్రం చేయడంతో పాటు వాటరు ట్యాంకులను బ్లీచింగ్ తదితర కెమికల్స్‌తో శుభ్రం చేయించామని ఈవో తెలిపారు.

ఈబీసీ రిజర్వేషన్లు అమలుకు చర్యలు తీసుకోండి

ఉప్పలగుప్తం, జూన్ 19: వైసీపీ ప్రభుత్వం కాపులకు అయిదు శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకత వ్యక్తం చేసిందని రాష్ట్ర కాపు, బలిజ సంక్షేమసేన రైతు అధ్యక్షుడు బసవా చినబాబు వ్యాఖ్యానించారు. బుధవారం కూనవరంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ హయాంలో రిజర్వేషన్ల అమలుకు చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం జగన్ పాలనలో రిజర్వేషన్లను పక్కన పెట్టారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వంలో తమకు రిజర్వేషన్లు వర్తిస్తాయని ఎందరో కాపు యువత ఆశలు పెట్టుకున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈబీసీ రిజర్వేషన్ల అమలుకు సత్వర చర్యలు తీసుకోవాలని చినబాబు అభ్యర్థించారు.

ఘనంగా సదస్యం

ఆత్రేయపురం, జూన్ 19: పురాణ ప్రసిద్ధి గాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీవేణుగోపాలస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సదస్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర వాటిని శాస్త్రోక్తంగా నిర్వహించి వేద పండితులు, అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లు నిర్వహించారు.

చందాలు వేసుకుని సాగునీటి కాల్వ తవ్వకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్19: రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో పంట కాలువను రైతులు చందాలు వేసుకుని బుధవారం జేసీబీతో తవ్వించుకున్నారు. ముచ్చుమిల్లి పంట కాలువపై 300ఎకరాలు పైబడి ఆయకట్టు సాగవుతుంది. ఐదేళ్లుగా పంట కాల్వను పట్టించుకోకపోవడంతో సాగునీరు పొలాలకు అందడం లేదు. మురుగు కాల్వలు పూడిక పోయి వర్షాలు వస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు పలుసార్లు విన్నవించినా స్పందించలేదు. సాగుసీజన్ మొదలు కావడంతో రైతులే చందాలు వేసుకుని కాల్వను తవ్వించుకున్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు నియమించాలి

ఆత్రేయపురం, జూన్ 19: మెగా డీఎస్సీ ద్వారా ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ చిన్నారుల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ యూఎస్‌టీఎఫ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ వేదిక రాష్ట్ర కన్వీనర్ మెర్ల సత్యనారాయణ బుధవారం అమరావతి సెక్రటేరియట్‌లోని సీఎంవో కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

బండారును అభినందించిన సమాచారశాఖ మాజీ జేడీ

ఆత్రేయపురం, జూన్ 19: కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావును బుధవారం సమాచారశాఖ మాజీ డైరెక్టర్ ఎం.ఫ్రాన్సిస్ కలిసి అభినందించారు. అలాగే మండలం నుంచి కూటమి పార్టీ శ్రేణులు, వివిధ శాఖల అధికారులు బండారును నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

రాయవరం, జూన్ 19: మాచవరం, వెదురుపాక గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో ఎ.గజలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తారన్నారు. వెదురుపాకలో సీడీపీవో, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం సీహెచ్ సుబ్బలక్ష్మి, కె.అనిల్, సూపర్‌వైజర్లు వి.విష్ణుకుమారి, ఎం.పెర్సి, ఆశావర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును వినియోగించుకోవాలి

మామిడికుదురు, జూన్ 19: రెవెన్యూ దినోత్సవం గురువారం 18గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం.మేరికమ్మ కోరారు. ఈసదస్సుల్లో రెవెన్యూ శాఖ నుంచి రైతులు, ప్రజలకు అందించే సేవలను, ఆ శాఖ నుంచి జారీచేసే ధ్రువపత్రాలు, భూవిషయాలు, నీటితీరువా విషయాలు వివరించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిశీలన

అంతర్వేది, జూన్ 19: సఖినేటిపల్లి మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, అంతర్వేదిపాలెం తదితర గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను అమలాపురం డీఎల్‌పీవో బొజ్జిరాజు బుధవారం పరిశీలించారు. ట్యాంకుల శుభ్రతపై సంతృప్తి వ్యక్తంచేస్తూ, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలకు దాణా పంపిణీ

కె.గంగవరం, జూన్19: కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉన్న గోశాలకు బుధవారం విశ్రాంత పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.కోటేశ్వరరావు పుట్టినరోజును పురస్కరించుకుని దాణా అందజేశారు. సబ్‌డివిజన్ పశుసంవర్ధకశాఖ అధికారి ఓ.రామ కృష్ణ, పశువైద్యులు ఎం.కృష్ణార్జున, సురేష్, బిందు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

కపిలేశ్వరపురం, జూన్ 19: పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం స్థానిక క్రిస్టియన్ కమ్యూనిటీ హాలులో జరిగింది. గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.ఏసురత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా రెవ డాక్టర్ బి.రూబెన్, ఉపాధ్యక్షుడిగా డేవిడ్‌రాజు, చీఫ్ ప్యాట్రన్‌గా నానిబాబు, కార్యదర్శిగా కిరణ్‌పాల్, ట్రెజరర్‌గా ఇమ్మానుయేల్, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్, రికార్డింగ్ కార్యదర్శిగా ప్రసాద్, సభ్యులుగా జీజీ రాజు, ఐజెక్‌క్రిస్టొఫర్, ధన్యకుమార్, సత్యకుమార్, మనేషే, జాన్‌రాజా, ప్రధాన సలహాదారులుగా ఎల్.మోషే, వై.ఏషయా కె.ఏసు రత్నం ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఆయన అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

పి.గన్నవరం, జూన్ 19: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూపాణి సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పేవిధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఊడిమూడి ఏటిగట్టు చెంతనున్న సంచార జాతుల పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో కె.హెలీనా సచివాలయ ఉద్యోగులతో కలిసి అవగాహన కల్పించారు. సమగ్రశిక్ష ఏఎల్ఎస్సీ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీవో ఎంఏకే భీమారావు, పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్ర్కీన్-1	: మ్యూజిక్‌షాప్ మూర్తి
శేఖర్ స్ర్కీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: రాజధాని రౌడీ
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: హరోం హర
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: భజే వాయువేగం